క్లుప్తంగా

గ్రంథాలయం ఏర్పాటుకు చొరవ చూపాలి

కరకగూడెం: మండల కేంద్రంలో తక్షణమే ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు గుడ్ల రంజిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో అధికారుల ను,పాలకులను కోరారు.గ్రంథాలయం లేకపోవడం వల్ల విద్యార్థులు, యువత, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదవడానికి మాత్రమే కాకుండా జ్ఞానాన్ని పెంపొందించడానికి, సమాచారాన్ని తెలుసుకోవడానికి, సామాజిక చర్చలకు వేదికగా నిలుస్తాయని అన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ నాన్ టీచింగ్ స్టాఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా ప్రచార కార్యదర్శి వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవనంలోని సమావేశ మందిరంలో ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షకురాలు ప్రమీల భాయ్, ఏవో కృష్ణార్జునరావ్, సీనియర్ అసిస్టెంట్ రాంబాబు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శిగా రమణమూర్తి, గౌరవ అధ్యక్షుడిగా నారాయణ, ఉపాధ్యక్షుడిగా ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారిగా రంగయ్య, ప్రచార కార్యదర్శిగా బీవీ రమణ, మహిళా విభాగము నుంచి మహిళా కార్యదర్శిగా రమణలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

రెయిన్ కోట్ల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లు అందించిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో సారపాక మేజర్ గ్రామపంచాయతీలోని 120మంది పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఆదివారం సారపాక గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్షుడు కె.రాంబాబు, కార్యదర్శి షేక్ చాంద్‌పాషాల ఆధ్వర్యంలో రెయిన్ కోట్స్ అందించారు. ఈ సందర్భంగా ఎండనకా, వాననకా నిత్యం ప్రజారోగ్యం కోసం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఐటీసీ ఉన్నతాధికారులు, రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ప్రతినిధులు చెంగలరావు, సాయిరాం, గోవిందరావు, సౌరవ్ ముఖర్జీ, ఏసుబు, విద్యావాణి, మల్లిఖార్జున్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామానా జెండా ఎగరాలి..

దుమ్ముగూడెం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాలన్ని గ్రామగ్రామానా నిర్వహించాలని ఆదివాసీ సేన నాయకుడు కాటబోయిన శ్రీను పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ములకపాడు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆదివాసీ సేన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం గ్రామ గ్రామాన జెండా ఎగరవేసి జయప్రదం చేయాలన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా కుంజా ప్రసాద్‌తోపాటు 18 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఆదివాసీ సేన నాయకులు కొరస నరేష్, కారం రమేష్, వాగే రాజేశ్వరి, ఛత్తీసగఢ్ రాష్ట్రం గంగిలేరు పంచాయతీ సర్పంచ్ ఆదివాసీ నాయకులు ఉయిక శంకర్, కోర్స సాయి తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికల ఆవిష్కరణ

దమ్మపేట: దమ్మపేటలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో.. ఆర్యవైశ్య రాజకీయ రణభేరి గోడ పత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు మాట్లాడుతూ.. ఆగష్టు 3న హైదరాబాద్‌లో జరగనున్న ఆర్యవైశ్య రాజకీయ రణభేరి మహా గర్జనకు అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు తరలివచ్చి, సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిక్కుమళ్ల సుధాకర్, దారా మల్లికార్జునరావు, దారా ప్రసాద్, వెంకటేశ్వరరావు, ప్రదీప్, వినోద్, చక్రధర్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల పరామర్శ

ములకలపల్లి: రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు (డిష్) కుటుంబాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య పరామర్శించారు. రాంబాబు తండ్రి రాఘవులు ఇటీవల మరణించగా.. ఆదివారం నిర్వహించిన దశదిన ఖర్మలో వారు పాల్గొన్నారు. రాఘవులు చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, సంఘ రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి సీహెచ్.ముసలయ్య, ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, చేడే పద్మావతి, సామిని, రామ్మూర్తి ఉన్నారు.

అమలు కాని ప్రణాళిక

- అశ్వారావుపేట మున్సిపాలిటీలో పడకేసిన పారిశుద్ధ్యం
- సిబ్బందిపై లేని అజమాయిషీ
- సమస్యలు పట్టని అధికారులు



చిన్నంశెట్టి బజారులో మురుగునీటితో నిండిపోయిన డ్రైయినేజీ



మట్టికుప్పలతో చిన్నంశెట్టి బజారు



వడ్డెరబజారు వద్ద పిచ్చిమొక్కలతో నిండిపోయిన డ్రైయినేజీ

అశ్వారావుపేట: తెలంగాణ ప్రభుత్వం మున్సిపాలిటీల పరిశుభ్రత కోసం తీసుకున్న వంద రోజుల ప్రణాళిక అశ్వారావుపేట మున్సిపాలిటీలో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. సమస్యలు ఎక్కడివి అక్కడే ఉండిపోయాయి. మాంసం దుకాణదారులతో సమావేశం తప్ప ఇంకేమీ చేపట్టలేక పోయారు. ఆరంభ శూరత్వంగా ప్రదర్శన నిర్వహించారు తప్ప ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క ప్రణాళిక అమలు చేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రణాళిక అంశాలు.. అమలు తీరు

ప్రభుత్వం మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన పనులపై ప్రణాళిక నిర్దేశించింది. ఆ ప్రకారం జూన్ 2న అశ్వారావుపేట మున్సిపాలిటీలో ప్రదర్శన నిర్వహించారు. దీని ప్రకారం ప్రణాళికలో పొందుపరిచిన అంశాలు.. స్థానిక మున్సిపాలిటీ పరిధిలో వాటి అమలు తీరును పరిశీలిస్తే..

☞ ప్రణాళిక ప్రకారం మురుగునీటి కాలువలు, నాలాల్లో పూడిక తీయాలి. ఇందుకోసం కాంట్రాక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు, యంత్రాలు, పరికరాలను భాగస్వామ్యం చేసుకోవాలి. ఇది నిరంతర ప్రక్రియ. ఇందుకోసం కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి.

గ్రామ పంచాయతీ తరహాలో చెత్త సేకరణ మొక్కుబడిగా సాగుతోంది తప్ప మరేమీ కొత్తగా లేదు. డ్రైయినేజీల్లో సిల్టును ఎత్తి రోడ్డుపై కుప్పలుగా పెట్టేశారు. దీంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

☞ మైక్ ద్వారా ప్రకటనలు, సోషల్‌మీడియాలో ప్రచారాలు చేయాలి. ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలి. కాలర్ ట్యూన్‌లు, పెయింటింగ్ తదితర సాధనాల ద్వారానూ అవగాహన కల్పించాల్సి ఉంది.

☞ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు మార్కెట్ విక్రేతలు, దుకాణదారులు, పాఠశాలల వంటి వారిని గుర్తించి వారిని ఆహ్వానించి అభిప్రాయాలను సేకరించాలి. అందరినీ భాగస్వాములను చేయాలి.

పై కార్యక్రమాలేవీ జరగడం లేదు. కేవలం మాంసం దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. అదీ వ్యాపార పరమైనే సమావేశమే.

☞ సింగిల్ యూజ్ ప్లాస్టిక్, డిస్పోజబుల్‌ను నివారించడానికి, గ్రీన్ ప్రొటోకాల్‌ను అమలు చేయడానికి బర్తన్ బ్యాంకులు ఏర్పాటు చేయాలి. సామూహిక, ఇతర కార్యక్రమాలలో వీటిని అమలు చేయాలి.

☞ తడి, పొడి చెత్తలను ఇంటి వద్దనే వేరు చేసి కంపోస్టును తయారు చేయడాన్ని నేర్పించాలి. తద్వారా మున్సిపల్ డంప్‌యార్డుపై భారం తగ్గుతుంది. వీరి ఉత్పత్తులను మార్కెటింగ్ సౌకర్యం కలిగేలా అవగాహన పెంచాలి.

☞ స్వచ్ఛభారత్ ఐఈసీ క్యాంపులు నిర్వహణ, అమృత్ రీఫార్మ్స్, ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల ప్రదర్శన, స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్‌ల నిర్వహణ, కొత్త ఎస్‌హెచ్‌జీల ఏర్పాటు, బ్యాంకు లింకేజీలు చేయాలి.

పై కార్యక్రమాలను మెప్మా భాగస్వామ్యంతో చేపట్టాల్సి ఉంది. ఇంకా సెర్ప్ పరిధిలోనే మహిళా సమాఖ్యలు కొనసాగుతున్నాయి. ఆన్‌లైన్‌లో ప్రక్రియ పూర్తి కావలసి ఉంది. ఈ కారణం చేత పై పనులు మొదలు కాలేదు.



దొంతికుంట వద్ద పూడిపోయిన కల్వర్టు

ఇవి కాక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పబ్లిక్ టాయిలెట్ల తనిఖీ, రోడ్ల పక్కన పిచ్చి మొక్కలను తొలగించడం కోసం ప్రణాళిక సిద్ధం చేసి పునరావృతం కాకుండా చూడడం వంటి ఎన్నో ప్రణాళిక కార్యక్రమాలు అసలు మొదలుపెట్టలేదు.

పారిశుద్ధ్యం అధ్వానం..

కొత్తగా ఏర్పడ్డ అశ్వారావుపేట మున్సిపాలిటీలో పారిశుద్ధ పనుల నిర్వహణ అధ్వానంగా తయారైంది. కార్మికులపై సిబ్బంది పర్యవేక్షణ పూర్తిగా లోపించడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం ఏ పేరుతో ఏకార్యక్రమం తీసుకొచ్చినా క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన వారు చేయకుంటే ఏ పథకమూ గట్టెక్కదని అధికారులు గుర్తించడం లేదు. వానాకాలం ఆరంభమైనా.. పారిశుద్ధ పనులు ఏమాత్రం ముందుకు సాగకపోవడం ఇందుకు నిదర్శనం.

ఈ విషయాలను కమిషనర్ నాగరాజు దృష్టికి తీసుకువెళ్లగా కొత్తగా మున్సిపాలిటీ ఏర్పాటయినందున సెర్ప్ నుంచి మెప్మాకు స్వయం సహాయక సంఘాల డేటా మారలేదన్నారు. పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు.

తుమ్మలచెరువు నీరు విడుదల

అశ్వాపురం: మండలంలో సుప్రసిద్ధసాగునీటి వనరైన, వేలాది మంది రైతులు, రైతు కూలీలకు జలనిధి అయిన కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువు ఆయకట్టుకు ఆదివారం మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఆయకట్టు రైతులు చెరువు తూములు తీసి నీరు విడుదల చేశారు. చెరువుకు 14 అడుగుల నీరు రావడంతో ఖరీఫ్ సీజన్‌కు చెరువు కింద మూడు ప్రధాన కాలువలైన కుందారం, చదలవాడ, ఊరవాయి కాలువలకు నీరు విడుదల చేశారు. తుమ్మలచెరువు కింద 10 వేల ఎకరాలలో రైతులు వరిసాగు చేస్తున్నారు. గత ఐదు రోజుల క్రితం వరకు వర్షాలు లేక చెరువుకు నీరు రాక ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకమనుకున్న తరుణంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులోకి 14 అడుగులకు పైగా నీరు రావడంతో ఖరీఫ్‌కు నీరు అందింది. రైతులు సంతోషంతో వరిసాగుకు సిద్ధమయ్యారు. గత మూడు రోజులుగా రైతులు, రైతు కూలీలు, మహిళా కూలీలు వరినాట్ల పనుల్లో బీజీబీజీగా ఉన్నారు. వరినాట్లకు స్థానిక మహిళా కూలీలతో పాటు ఆంధ్రా, బెంగాల్ ప్రాంతాల నుంచి కూలీలు వచ్చి ఉపాధి పొందుతున్నారు. నెల రోజుల పాటు రైతులు, రైతు కూలీలు, కూలీలు వారి కుటుంబసభ్యులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం కానున్నారు.



తుమ్మలచెరువు తూముల నుంచి నీరు విడుదల చేస్తున్న రైతులు

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. మండలపల్లి గ్రామానికి చెందిన పాలడుగుల ప్రశాంతి అను మహిళ అనారోగ్యంతో మృతి చెందగా.. ఆమె భౌతిక కాయానికి ఎమ్మెల్యే జారే పూలమాలతో నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటానని తెలిపారు. అదే గ్రామంలో డ్రైయినేజీ సమస్యను ఎమ్మెల్యేకు గ్రామస్తులు తెలుపగా.. సంబంధిత అధికారులతో ఫోన్ లైన్‌లో మాట్లాడారు. డ్రైయినేజీల్లో వర్షపు నీరు నిలువకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం దమ్మపేట ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలవకుండా చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించి, బాధ్యులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్వతనేని ప్రసాద్, సాయిల నర్సీ, రొయ్యల కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మండలపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

గురుకుల విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న గురుకుల విద్యార్థులు

మణుగూరురూరల్: జిల్లా కేంద్రంలోని హనుమాన్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన జిల్లా స్థాయి యోగాసనాల పోటీల్లో మండలంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో పాఠశాలకు చెందిన వల్లేపు వంశీ ప్రథమ, జి.తరుణ్ ద్వితీయ, కొత్తపల్లి కౌశిక్, పాయలీ శివకుమార్‌లు తృతీయ స్థానాల్లో నిలువగా.. రెథమిక్ విభాగంలో కొత్తపల్లి కౌశిక్, పాయలీ శివకుమార్‌లు ప్రథమ, వల్లేపు వంశీ, గంగాధర శ్రీరామ్ ద్వితీయ స్థానాల్లో నిలిచి బహుమతులను కైవసం చేసుకున్నారు. అలాగే ఫార్వాడ్ బెండ్ విభాగంలో ఆత్మకూరి సాత్విక్ ప్రథమ, బ్యాక్‌వర్డ్ బెండ్ విభాగంలో ఆకుల భరత్ ప్రథమ, ఆకుల భవన్ ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. విద్యార్థులను ఆర్‌సీఓ రాంబాబు, పాఠశాల ప్రిన్సిపల్ రజిని, పీఈటీ సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

మృతుడికి నివాళి

దుమ్ముగూడెం: బీఆర్ఎస్ పార్టీ మండల కో కన్వీనర్ జానీపాషా సోదరుడు ఖాసీం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మృతదేహాన్ని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు జానీ కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించి సంతాపం తెలియచేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తెల్లం సీతమ్మ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రావూలపల్లి రాంప్రసాద్, మండల కన్వీనర్ కణితి రాముడు, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, బొల్లి వెంకట్రావు, కాలవ పూర్ణయ్య, అపక వీర్రాజు, బుక్యా చంద్, కుమ్మరికుంటా సూర్య, బాణోత్ నగేష్, కాంగ్రెస్ నాయకులు బత్తుల శోభన్ బాబు, నరేంద్ర, తోట రమేష్, అల్లాడి వెంకటేష్, మున్నా తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కలాం బోధనలు ఆదర్శం



మణుగూరుటౌన్: అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మణుగూరుటౌన్: భారత రత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బోధనలు ఆచరణీయం, ఆదర్శవంతమైనవని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి.నవీన్, పట్టణ అధ్యక్షుడు శివ అన్నారు. ఆదివారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. యువత కోసం ప్రేరణాధారణ వంటి మిస్సైల్ మ్యాన్ ఆదర్శాలను గుర్తు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, గాండ్ల సురేష్, కొర్లకుంట అప్పారావు, కుర్రం రవి, బొజ్జ త్రిమూర్తులు, రామ సుబ్రహ్మణ్యం, ఎస్‌కే అబ్దుల్లా, మానస, ఆదిలక్ష్మి, శ్రీను, బత్తుల శ్రీను, గనిబోయిన నాగేశ్వరరావు, యువజన నాయకులు పల్లం నాగేశ్వరరావు, పాడుతూరి రవి, నానాజి తదితరులు ఉన్నారు.

జోరు వానలోనూ చెత్త సేకరణ

కరకగూడెం: సాధారణంగా వర్షాలు పడినప్పుడు పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలుగుతుంది. అయితే కరకగూడెం గ్రామ పంచాయతీ కార్మికులు ఓ వైపు జోరుగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తమ రోజువారీ చెత్త సేకరణ విధులను కొనసాగించారు. ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడం, వీధులను శుభ్రం చేయడం, మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం వంటి పనులను క్రమం తప్పకుండా చేశారు.

‘కంకర’తో కాలం వెల్లదీయాల్సిందేనా!



అల్లిగూడెం–శ్రీరంగాపురం మార్గంలో కంకర వేసి నిలిపివేసిన పనులు



మూలమలుపు వద్ద కమ్మేసిన పిచ్చిమొక్కలు

అశ్వారావుపేటరూరల్: పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని ఓ ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారింది. బీటీ రోడ్డు కాస్తా కంకర రోడ్డుగా మారి, ప్రయాణికులను కష్టాల పాలు చేస్తోంది. దీంతో వాహనదారులు గడిచిన రెండేళ్లుగా ‘కంకర’తోనే కాలం వెల్లదీస్తున్నారు.

అశ్వారావుపేట మండలంలోని అల్లిగూడెం–శ్రీరంగాపురం మధ్య 1.5 కి.మీ బీటీ రోడ్డు మూడేళ్ల క్రితం క్రితం పాడైంది. రోడ్డంతా బీటీ లేచిపోయి, గుంతలతో ఆధ్వానంగా మారింది. దీంతో ఈ మార్గంలో బీటీ రోడ్డు పునఃనిర్మాణానికి రెండేళ్ల క్రితం పీఆర్ శాఖ ద్వారా రూ.55లక్షలు కేటాయించి, టెండర్లు పిలిచారు. ఈ పనులను దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ ఏడాది క్రితం హడాహుడిగా రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టి కంకర పోయించారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల రావడంతోపాటు, తొలి విడత బిల్లు కాలేదనే సాకుతో నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేశాడు. దాంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు, రైతులు నిత్యం నరకయాతన పడాల్సి వస్తోంది. ఈ మార్గంలో అత్యధికంగా పామాయిల్ తోటలు, నర్సరీలు ఉండటంతో రైతులు తమ పంటలను రవాణా చేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదకరంగా మలుపు..

మండలంలోని అల్లిగూడెం నుంచి శ్రీరంగాపురం (నారంవారిగూడెం కాలనీ) వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో రెండు వైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ముందు వచ్చే వాహనాలు కనిపించడం లేదు. మూలమలుపుల వద్ద పిచ్చి మొక్కలు కమ్మేసి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన తర్వాత బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. నిర్మాణ పనులు చేపట్టే విధంగా తగిన చర్యలు తీసుకుంటాం.

– అక్షిత, పంచాయతీరాజ్ ఏఈఈ

ఘనంగా తీజ్ వేడుకలు



కులదేవతలకు పూజలు చేస్తున్న గిరిజనులు

చండ్రుగొండ: గిరిజన లంబాడీల సాంప్రదాయ పండుగైన తీజ్ వేడుకలు ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పోకలగూడెం గ్రామంలో తొమ్మిది రోజులపాటు పూజల అనంతరం తీజ్ పండుగకు చివరిరోజు వీడ్కోలు పలికారు. కులదేవతకు మొక్కలు తీర్చుకున్నారు. యువతులు సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, మీన, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెద్ద వరదకు చిన్న కాల్వ నిర్మాణం!

- వినాయకనగర్‌కు తప్పని వరద తిప్పలు
- అధికారులు దృష్టి సారించాలని వేడుకోలు



బ్రిడ్జికి మరోవైపు రెండు అడుగుల మేర మాత్రమే నిర్మాణం చేపడుతున్న కాలువ

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ శివారు గ్రామమైన వినాయకనగర్ వాసులకు ప్రతి ఏటా వానకాలం ముప్పు తిప్పలు తప్పడం లేదు. మోస్తరు వాన వచ్చిందంటే చాలు ఎగువన ఉన్న చెరువు, పంట పొలాల ప్రాంతాల నుంచి వస్తున్న వరద వినాయకనగర్‌ను ముంచెత్తుతూ.. శ్రీశ్రీనగర్ బ్రిడ్జి మీదుగా మొట్టువాగులో కలుస్తున్నాయి. దీంతో మండలంలో కురిసిన వర్షం తగ్గుముఖం పట్టినా అదనంగా మరో రోజు వరకు వినాయకనగర్‌లో వరద నీరు జోరు కొనసాగుతోంది. స్థానికుల విజ్ఞప్తుల మేరకు సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శ్రీశ్రీనగర్, వినాయకనగర్‌లో సైడ్ కాల్వల నిర్మాణానికి రూ.1.20 కోట్లు నిధులు మంజూరు చేయగా.. పనులు జరుగుతున్నాయి. అయితే బ్రిడ్జికి అనుసంధానం చేసేందుకు చేపట్టిన కాలువ నిర్మాణం.. బ్రిడ్జికి రెండు తూములు ఉండగా, ఒక్క తూముకు సరిపోయే కాలునే నిర్మిస్తున్నారు. సుమారు 10 అడుగుల మేర ఉన్న బ్రిడ్జికి రెండు అడుగుల కాల్వ నిర్మిస్తుండటంపై స్థానికులు విస్తుపోతున్నారు. బ్రిడ్జికి ఒక వైపు వానకాలం వచ్చే భారీ వరదకు సరిపోయే విధంగా సుమారు 10 అడుగుల కాల్వ ఉండగా, దానికి అనుసంధానం చేసేందుకు ప్రస్తుతం నిర్మిస్తున్న కాల్వ మూడు అడుగులకు కూడా మించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిర్మాణాలు కంటితుడుపు చర్యలేనని వినాయకనగర్ వరద ముంపు తగ్గించే విధంగా శాశ్వత పరిష్కారం చేసేలా బ్రిడ్జికి సరిపడా కాలువ నిర్మాణం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై సైడ్ కాల్వల నిర్మాణాలను పర్యవేక్షిస్తున్న పబ్లిక్ హెల్త్ ఏఈ సత్యను వివరణ కోరగా, కాల్వ నిర్మాణం జరుగుతున్న ప్రదేశం స్థానికులు కొనుగోలు చేశామని చెబుతున్నారని, అందువల్లే రెండు అడుగుల్లో నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. ఆ కాగితాలు పరిశీలించిన అనంతరం అవసరమైన చర్యలు చేపడతామన్నారు.

విషసర్పాలతో జర భద్రం

- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ
- వానాకాలం పాముల సంచారం ఎక్కువ..
- కాటుకు గురయ్యే ప్రమాదం



దుమ్ముగూడెం: జేజెన్సీ ప్రాంతమైన మండలంలో ప్రతి ఏటా వర్షాకాలంలో రైతులు, ప్రజలు పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. వానాకాలంలో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నవంబర్ వరకు పాములు, ఇతర విష కీటకాల ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఈ నేపథ్యంలో పాము కాటుకు గురైయ్యే అవకాశం ఉంది. వెంటనే దగ్గరిలోని వైద్యశాలకు తీసుకునిరావాలని సొంత వైద్యం,నాటు మందులు వాడుతూ సమయం వృథా చేయకూడదు. పూర్తి ఏజెన్సీ మండలం కావడంతో గిరిజన ప్రజలు ఎక్కువగా సొంతవైద్యం చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటారని, అటువంటి పనులు చేయకుండా వెంటనే వైద్యశాలకు తీసుకురావాలని వైద్యులు సూచిస్తున్నారు.

నమోదైన కేసులు..

మండలంలో గతేడాది నుంచి ఇప్పటి వరకు దుమ్ముగూడెం పీహెచ్‌సీలో 55, పర్ణశాల పీహెచ్‌సీలో 07, నర్సాపురం పీహెచ్‌సీలో 05 పాముకాటు కేసులు నమోదయ్యాయి. పాము కాటుకు గురైన వెంటనే వైద్యశాలకు వచ్చిన వారిలో చాలా మంది ప్రాణాప్రాయం నుంచి బయటపడ్డారు. నాటు మందులు వాడుతూ సమయభావం వలన చికిత్స అందక మృతి చెందిన వారూ ఉన్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

పొలాల గట్లమీద వెళ్లేటప్పుడు కర్రతో చప్పుడు చేస్తూ నడవడం మంచిది. రాత్రిపూట పొలాలకు నీరు కట్టడానికి వెళ్లినప్పుడు టార్చిలైట్ తీసుకుని వెళ్లాలి. ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలి. పాము కాటు కంటే చాలామంది షాక్‌తోనే ప్రాణం మీదకు తెచ్చుకుంటారు. ఇంట్లో వారు ధైర్యం చెప్పాలి. పాముకాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తంతో పాటు విషం వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటు పెడతారు.. అలా చేయకూడదు. ఒక్కోసారి పాము కాటు కన్నా ఆ గాయం ప్రమాదకరంగా మారవచ్చు.

అందుబాటులో ఇంజెక్షన్లు..



పాముకాటు బారిన పడిన వారికి పీహెచ్‌సీల్లో చికిత్స అందుబాటులో ఉంటుంది. వారికి కావాల్సిన యాంటీ స్నేక్‌వీనం ఇంజెక్షన్లు మండలంలోని మూడు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రథమ చికిత్స చేసి గాయాన్ని బట్టి రెండు సార్లు స్నేక్‌వీనం డోస్ తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదు. పాము కరిచిన వెంటనే ఆరోగ్య కేంద్రానికి చేర్చాలి.

– డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి, దుమ్ముగూడెం పీహెచ్‌సీ